క్లుప్తంగా

క్రీడాకారులకు వాలీబాల్ కిట్ అందజేత



పెనమలూరు: గంగూరులో క్రీడాకారులకు వాలీబాల్ కిట్‌ను వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బంగారు నాగేంద్రబాబు ఆదివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు గురికాకుండా క్రీడల్లో రాణించాలని సూచించారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



పెనమలూరు: క్యాన్సర్‌పై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆర్చరీ కోచ్ చెరుకూరి సత్యనారాయణ అన్నారు. తాడిగడప ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైటాథన్ వాక్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి నుంచి తాడిగడప సెంటర్ వరకు వాక్ నిర్వహించారు. ఎల్‌వీ ప్రసాద్ క్యాంపస్ హెడ్ డాక్టర్ అనసూయ కపూర్ మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. తాము రెటినోబ్లాస్టోమాకు అత్యాధునిక చికిత్స అందిస్తామని చెప్పారు. అంధత్వ నివారణకు ఎల్‌వీప్రసాద్ ఆస్పత్రి ఉత్తమ సేవలు అందిస్తోందని చెప్పారు. సేకరించి నిధులతో కంటి క్యాన్సర్‌తో బాధపడే పిల్లలకు వైద్యం అందిస్తామన్నారు. ఈ వాక్‌లో దాదాపు 500 మంది పాల్గొన్నారు.

మానవత భవన నిర్మాణానికి దాతల విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరురోడ్డులో నిర్మిస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయం నిర్మాణానికి దాతలు ఇతోధికంగా విరాళాలు అందిస్తున్నారు. భవన నిర్మాణానికి బాణాల నరసింహారావు రూ.50 వేలు, కూరెళ్ల సుబ్బాచారి రూ.25 వేలు విరాళాన్ని మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావుకు ఆదివారం అందించారు. వీరితో పాటుగా పరమేశ్వర ఏజెన్సీస్ అధినేత కొండేటి భాస్కర్ మానవత భవన నిర్మాణానికి 100 సిమెంట్ బస్తాలను విరాళంగా అందజేశారు.

విద్యార్థుల ప్రతిభ వెల్లడికి పోటీలు దోహదం



గన్నవరం రూరల్: వ్యాసరచన పోటీలు విద్యార్థులలో అంతర్లీనంగా ఉన్న ప్రతిభను వెలికితీస్తాయని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వేసవి సెలవుల్లో విద్యార్థులలోని సృజన పెంచేందుకు సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేసిందన్నారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో నీతి కథలను విద్యార్థులచే చదివించారు.

మానవత నూతన కార్యవర్గం ఎన్నిక

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్‌జంక్షన్ శాఖ నూతన అధ్యక్షుడిగా కూరెళ్ల సుబ్బాచారి ఎన్నికయ్యారు. స్థానిక ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్‌లో ఆదివారం జరిగిన మానవత సమావేశంలో 2023–24 సంవత్సరానికి గానూ నూతన కార్యవర్గ ఎన్నికను జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు నేతృత్వంలో నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా కూరెళ్ల సుబ్బాచారి, ప్రధాన కార్యదర్శిగా క్లోపల్లి నారాయణరావు, కోశాధికారిగా పాట్రోలు గణేష్‌బాబు, ఉపాధ్యక్షుడిగా దయాల ప్రభాకరరావు, సంయుక్త కార్యదర్శిగా గంటా ఇందిరా దేవిని ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా గూడపాటి జయరామ చంద్రరావు, రేవిణిశెట్టి సూర్యనారాయణ, కన్నిగంటి వెంకట సుబ్బారావు, గోళ్ల మల్లికార్జునరావు ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికురాలికి గాయాలు

పెనమలూరు: కానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కార్మికురాలికి గాయాలయ్యాయి. పెనమలూరు సీఐ కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. పామర్రు మండలం కనుమూరు గ్రామానికి చెందిన కొడాలి సువార్తమ్మ దిలీప్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేస్తోంది. ఆమె కానూరు వద్ద విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి బందరు రోడ్డు పనులు చేసి రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమె భుజం, చేతికి గాయాలయ్యాయి. బాధితురాలిని పోరంకిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆఖరి మజిలీకి సిద్ధమవుతున్న స్వర్గపురి



ధ్యాన ముద్రలో 18 అడుగుల శివుని విగ్రహం



తుది దశకు చేరుకున్న మెరక పనులు



బోరు ఏర్పాటు పనులు

- దహన సంస్కారాలకు అత్యాధునిక సౌకర్యాలు
- దాత సహకారంతో 18 అడుగుల శివుని విగ్రహం

రామవరప్పాడు: గత టీడీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన రామవరప్పాడు శ్మశానవాటిక నేడు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటోంది. పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, విష సర్పాలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ఈ శ్మశానవాటికకు ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చొరవతో మోక్షం లభించింది. మృతదేహాలను వెంట పెట్టుకుని అంతిమ సంస్కారాలకు వచ్చే వారు మొన్నటి వరకు పడిన అగచాట్లకు స్వస్తి పలుకుతూ సకల సౌకర్యాలతో ఈ స్వర్గపురి రూపుదిద్దుకుంటోంది.

విజయవాడరూరల్ మండలంలో నగరానికి కూతవేటు దూరంలో ఉన్న మేజర్ పంచాయతీ రామవరప్పాడు. సుమారు 50వేల మంది జనాభా నివసించే ఈ గ్రామం మొత్తానికి పీఎస్ఆర్ కాలనీలోని ఒకే ఒక్క హిందూ శ్మశానం. గ్రామం మొత్తానికి ఒకే శ్మశానం కావడంతో అంతిమ సంస్కారాలకు వచ్చే వారికి సౌకర్యాలు కరువై భరించలేని కష్టాలు ఎదుర్కొన్నారు. కనీసం మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహించేందుకు షెడ్లు లేకపోవడంతో వేసవి కాలంలో ఎండుతూ, వర్షాకాలంలో తడుస్తూ అంతిమ సంస్కారాలు నిర్వహించుకోవాల్సిన దుస్థితి. దీనికి తోడు పిచ్చి మొక్కలు, అల్లుకుపోయిన ముళ్ల కంపలు, విష సర్పాల సంచారంతో బిక్కు బిక్కు మంటూనే చివరి తతంగాన్ని పూర్తి చేసుకునేవారు. రాత్రిళ్లు మందుబాబుల ఆగడాలతో పగిలిన మద్యం సీసాలు ఒక పక్క, అసాంఘిక కార్యకలాపాలు మరో పక్క నిత్య కృత్యమయ్యేవి. ప్రస్తుతం ఈ కష్టాలన్నింటికీ చెక్ పెడుతూ అత్యాధునిక సౌకర్యాలతో ఈ స్వర్గపురి అభివృద్ధిని సంతరించుకుంటుంది.

ఎమ్మెల్యే వంశీమోహన్ చొరవతో..

ఆఖరి మజిలీకు గ్రామస్తులు ఎదుర్కొంటున్న కష్టాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే వంశీ శ్మశానవాటిక అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపించారు. తొలి విడతగా మండల, పంచాయతీ నిధులు సుమారు రూ. 50లక్షలు కేటాయించడంతో యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 1.3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ శ్మశానవాటికలో సకల సౌకర్యాలను కల్పిస్తున్నారు. తొలుత పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించారు. మండలం నిధులు రూ.12.5లక్షలు, పంచాయతీ నిధులు రూ.3లక్షలతో సిమెంట్ రోడ్లను పూర్తి చేశారు. స్థలం మొత్తం మెరక పోయడానికి మండలం నిధులు మరో రూ.12 లక్షలు వెచ్చించి పనులు పూర్తి చేస్తున్నారు. రూ.17లక్షల మండల నిధులతో షెడ్లు, దహన సంస్కారాల నిమిత్తం అల్యూమినియంతో స్ట్రక్చర్లు ఏర్పాటు చేయనున్నారు. అంతిమ సంస్కారాలకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు పడకుండా వెయిటింగ్ హాల్, జల్లు స్నానాల గదులు, మరుగుదొడ్లు, పిండ ప్రదానం చేయడానికి అవసరమైన సౌకర్యాల కల్పన శరవేగంగా జరుగుతున్నాయి. పూర్తి చేసిన సిమెంట్ రోడ్లకు ఇరువైపులా గ్రీనరీని ఏర్పాటు చేయనున్నారు. దహన సంస్కారాలకు వచ్చే వారికి తాగునీటికి ఇబ్బంది పడకుండా బోరు, శ్మశానవాటిక చుట్టూ ప్రహరీగోడకు సంబంధించి నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

రూ.10 లక్షలతో శివుని విగ్రహం

గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కందిమళ్ల అంజనీకుమారి భర్త కందిమళ్ల ఆంజనేయులు తన సొంత నిధులు సుమారు రూ.10 లక్షలు వెచ్చించి ధ్యాన ముద్రలో 18 అడుగుల భారీ శివుని విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు. తన తల్లిదండ్రులు వీరయ్య చౌదరి, ఆది లక్ష్మమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన విగ్రహ నిర్మాణం దాదాపు పూర్తి అయింది. విగ్రహానికి తుది మెరుగుల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇలాగే గ్రామంలో మరికొంత మంది దాతలు ముందుకొస్తే ఈ శ్మశానవాటికను మరింతగా అభివృద్ధి చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తున్నాం



మండలంలోని గ్రామాల్లో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నాం. రామవరప్పాడులో శ్మశానవాటిక అభివృద్ధి నోచుకోక పడుతున్న ఇబ్బందులను గుర్తించాం. ఎమ్మెల్యే వంశీమోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు సహకారంతో తొలి విడతగా సుమారు రూ.50 లక్షలు మంజూరు చేశాం. అవసరమైన పక్షంలో మరిన్ని నిధులు కేటాయించేందుకు కృషి చేస్తాం.

– చెన్ను ప్రసన్నకుమారి, ఎంపీపీ

అదృష్టంగా భావిస్తున్నాను



ఈ శ్మశానవాటిక అభివృద్ధిలో నా వంతు భాగస్వామ్యం ఉండటం అదృష్టంగా భావిస్తున్నా. వేలమందికి ఉపయోగపడే ఈ స్వర్గపురిలో 18 అడుగుల ఎత్తు శివుని విగ్రహాన్ని సొంత నిధులు రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయిస్తున్నా. నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి.

– కందిమళ్ల ఆంజనేయులు, దాత

సురక్షిత, ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యం





నున్న పవర్‌గ్రిడ్ వద్ద అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు, సిబ్బంది

- సీఐలు కె.శ్రీనివాస్, జి.గురుప్రకాష్
- వాహనదారులకు అవగాహన

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సురక్షిత, ప్రమాద రహిత ప్రయాణమే మన అందరి బాధ్యత అని, వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని అజిత్‌సింగ్‌నగర్, నున్న సీఐలు జి.గురుప్రకాష్, కె.శ్రీనివాస్‌లు సూచించారు. నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు అజిత్‌సింగ్‌నగర్, నున్న రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని నున్న పవర్ గ్రిడ్ ఎదుట, సింగ్‌నగర్ నందమూరినగర్ ప్రాంతాల్లో ప్రయాణికులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి..

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపే వారు సీటు బెల్టులు తప్పనిసరిగా ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మంది ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారే ఉంటున్నారని, వీటికి ప్రధాన కారణం వారంతా హెల్మెట్‌లు ధరించకపోవడమేనని చెప్పారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకొని వాటిని పాటించాలన్నారు. ప్రధానంగా మద్యం సేవించి వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నడపవద్దని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. వాహనదారులు ప్రమాదాలకు గురికావడంతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని చెప్పారు. డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. చాలా సందర్భాల్లో ప్రమాదాలకు మైనర్లు కారణమవుతున్నారని చెప్పారు. స్టేషన్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు అండగా జగనన్న ప్రభుత్వం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విశ్వబ్రహ్మణులకు జగనన్న ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ పేర్కొన్నారు. విశ్వకర్మ ఫౌండేషన్, సేవా ట్రస్ట్ అలయన్స్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఆదివారం చిట్టినగర్ విశ్వ బ్రహ్మణ కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం, వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తోలేటి శ్రీకాంత్ తొలుత విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. విశ్వకర్మ ఫౌండేషన్, సేవా ట్రస్ట్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, వివాహ పరిచయ వేదికను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో అనేక మంది లబ్ధి పొందుతున్నారని, అన్ని వర్గాలకు వైఎస్ జగన్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా ఫౌండేషన్ అధ్యక్షుడు గోల్తి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి సేవలు పొందారు. సేవా కార్యక్రమాలను సంఘం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు కొత్తపల్లి సత్యనారాయణ, మంగేష్, బంగారయ్య, గోవిందరాజులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చైర్మన్ తోలేటి శ్రీకాంత్

శరవేగంగా యూజీడీ మ్యాన్‌హోల్స్ పనులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్ మెయిన్ రోడ్డు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రోడ్డులో యూజీడీ మ్యాన్‌హోల్స్ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇక్కడ బుడమేరు పక్కనే ఉండటంతో మ్యాన్‌హోల్స్ కోసం తవ్వన గోతులలోకి నీళ్లు రావటంతో పాటు మట్టి విరిగి పడటంతో మోటారుతో నీటిని తోడి వేసి జేసీబీతో సరిచేసి యూజీడీ మ్యాన్‌హోల్స్ నిర్మిస్తున్నారు. అలాగే రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేశారు. సాధ్యమైనంత త్వరలోనే యూజీడీ పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ తెలిపారు.



• గూళ్లు సిద్ధం !

నున్న శివారు ప్రాంతం పాలెం గ్రామంలో చెట్లపై ఏర్పాటు చేసుకున్న పక్షుల గూళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గూళ్లకు అవసరమైన గడ్డిని పక్షులు తీసుకువచ్చి అల్లుకుంటూ వాటిలో సేదతీరుతున్నాయి. ఆ మార్గంలో వెళ్తున్న వాహనదారులు చెట్లపై ఉన్న గూళ్లను ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. పక్షుల గూళ్లను సాక్షి కెమెరా 'క్లిక్'మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





అన్న సంతర్పణ సమితి సేవలు అభినందనీయం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అన్న సంతర్పణ సమితి సేవలు అభినందనీయమని ఏపీ మైనార్టీ సంక్షేమశాఖ స్పెషల్ సెక్రటరీ ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. అన్న సంతర్పణ సమితి ట్రస్ట్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. పేదలకు అన్నదానం మహాదానమన్నారు. సమాజంలో ఆకలిగా ఉన్న పేదవారికి అన్నదానం చేయటం అద్భుతమైన కార్యక్రమమని కొనియాడారు. ప్రతి రోజూ అన్నదానం చేయటం సామాన్యమైన విషయం కాదన్నారు. ఆకలిగా ఉన్న వ్యక్తులు ఎక్కడ ఉంటారో అక్కడకు వెళ్లి ప్రత్యేకంగా ఆహారాన్ని అందించటం వెనుక చాలా కృషి ఉందన్నారు. తాను ఈ జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలోనూ మంచి సేవలందించిందని గుర్తు చేశారు.



చిన్నారికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఇంతియాజ్ అహ్మద్ తదితరులు

యోగా శక్తితో మైగ్రేయిన్‌కు చికిత్స

పెనమలూరు: మైగ్రేయిన్ (పార్శ్వపు నొప్పి)కు ఉత్తమమైన చికిత్స యోగాశక్తి చికిత్స అని యోగా శక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ అన్నారు. కానూరు అశోక్‌నగర్‌లో ఆదివారం ఇండియన్ ఓం కార్యాలయంలో జరిగిన మైగ్రేయిన్ చికిత్స అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మైగ్రేయిన్‌తో బాధపడుతున్న వారు భారతీయ సంప్రదాయ చికిత్స యోగాశక్తితో అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. మందులు వాడకుండా, ఎటువంటి సైడ్ ఎఫెక్టులు లేకుండా మైగ్రేయిన్ సమస్యను పరిష్కరించవచ్చని వివరించారు. ఈ సందర్భంగా పలువురికి ఉచితంగా యోగా చికిత్స చేశారు.



మైగ్రేయిన్‌కు చికిత్స చేస్తున్న దృశ్యం

యోగాతో ఏకాగ్రత, ఆరోగ్యం

కంకిపాడు: యోగాతో ఏకాగ్రత, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అనాథ రక్షక యోగి ఈశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో యోగా శిక్షణా శిబిరం ఆదివారం ప్రారంభమైంది. శిబిరాన్ని ఈశ్వర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. పిల్లల్లో ఏకాగ్రత, పెద్దల్లో దీర్ఘకాలిక వ్యాధులకు పరిష్కారం యోగాలోనే లభిస్తుందన్నారు. యోగా శిక్షకులు నేరెళ్ల తులసీకృష్ణను సభకు పరిచయం చేసి సన్మానించారు. కార్యనిర్వాహక సభ్యులు కాకర్ల నాగేశ్వరరావు, నందం వామాక్షి, అసోసియేషన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్, కార్యదర్శి కె.నాగప్రసాద్ పర్యవేక్షించారు.



యోగా ప్రయోజనాలను వివరిస్తున్న ఈశ్వర్‌రెడ్డి

నైతిక విలువలు పెంపొందాలి

ఉయ్యూరు: విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు పెంపొందించుకోవాలని రిసోర్సుపర్సన్ ఎస్.వీ.అశోక్ అన్నారు. ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఆదివారం నైతిక విలువలపై సదస్సు నిర్వహించారు. అశోక్ మాట్లాడుతూ నైతిక విలువలతోనే సమాజ అభ్యున్నతి సాధ్యమన్నారు. దేశ నేతల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి బి.రమణి, సిబ్బంది పర్యవేక్షించారు.



విద్యార్థులకు సూచనలు చేస్తున్న అశోక్

ఉత్సాహంగా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతుంది. జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో ఈ శిబిరంలో కబడ్డీ, హ్యాండ్ బాల్, ఫెన్సింగ్ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. పరిసర గ్రామాలకు చెందిన బాలబాలికలు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. వ్యాయామోపాధ్యాయులు ధనియాల నాగరాజు ఆధ్వర్యంలో బాలబాలికలకు క్రీడల్లో మెలకువలు నేర్పుతున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం జరగనున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలని నాగరాజు కోరారు. అదేవిధంగా దావాజిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో పీడీ దాసరి శ్రీహర్ష నేతృత్వంలో వాలీబాల్ శిక్షణ శిబిరం కొనసాగుతుంది.



ఫెన్సింగ్ శిక్షణ పొందుతున్న బాలురు

పుస్తక పఠనంతో మేథోవికాసం

కంకిపాడు: పుస్తక పఠనంతో మేథోవికాసం సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. వేసవి శిక్షణా కార్యక్రమాలు గ్రంథాలయాల్లో కొనసాగుతున్నాయి. ఆదివారం కంకిపాడు శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం నిర్వహించారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంపొందేలా ఉపాధ్యాయుడు ఎం. మల్లేశ్వరరావు సూచనలు చేశారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్యారమ్స్, చెస్ పోటీల్లో శిక్షణ ఇచ్చారు. శిక్షణను గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.



తెన్నేరు శాఖా గ్రంథాలయంలో క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దర్శనానికి విచ్చేసిన భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలను ఆదివారం ఆయన పరిశీలించారు. మహా మండపం రెండో అంతస్తులో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానం, అమ్మవారి దర్శనానికి భక్తులు వేచి ఉన్న క్యూలైన్లను పరిశీలించారు. దేవస్థానం కల్పిస్తున్న సదుపాయాలను భక్తులను అడిగి తెలుసుకున్నారు. అన్నప్రసాదం స్వీకరించేందుకు విచ్చేసిన భక్తుల పట్ల సిబ్బంది మర్యాద పూర్వకంగా వ్యవహరించడంతో పాటు వారికి సంతృప్తికరంగా అన్నప్రసాదం అందించాలని సూచించారు. క్యూలైన్లు కూలర్లు, ఫ్యాన్లు తిరుగుతున్నాయా లేదా అని పరిశీలించడంతో పాటు క్యూలైన్‌లో ఏర్పాటు చేసిన మంచినీటి సదుపాయంతో పాటు ఆలయ పరిసరాల్లో మరిన్ని చోట్ల భక్తులకు మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.